# అభివృద్ధికి కేరాఫ్ పాలేరు

- అభివృద్ధిలో దూసుకుపోతున్న పాలేరు నియోజకవర్గం
- భక్తరామదాసు ఎత్తిపోతలతో పంటలు సస్యశ్యామలం
- పల్లె ప్రగతితో మారిన పల్లెల రూపురేఖలు
- నియోజకవర్గానికే తలమానికం మత్స్య, నర్సింగ్, జేఎన్టీయూ కళాశాలలు
- 'నమస్తే తెలంగాణ ప్రతినిధి'తో పాలేరు బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి

ఖమ్మం, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'గొప్ప పనులు చేసిన వారిని ప్రజలెప్పుడూ గొప్పవారిగానే చూస్తారు. అవకాశవాదులు మాత్రం ఎప్పుడూ ఏవేవో మాట్లాడుతుంటారు. కానీ.. గొప్పవారి స్థానం ప్రజల గుండెల్లో ఎప్పుడూ పదిలంగానే ఉంటుంది' అని పాలేరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన 'నమస్తే తెలంగాణ ప్రతినిధి'తో మాట్లాడారు. '2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించింది. మూడో విజయం సాధించేందుకు తహతహలాడుతోంది. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ఇటు అభివృద్ధి, అటు సంక్షేమాన్ని అమలు చేస్తున్నందునే రెండుసార్లు ముఖ్యమంత్రి అయ్యారు అని పేర్కొన్నారు. కానీ.. ఇక్కడ మాత్రం ఒక నాయకుడేమో గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా పాదాలు కడుగుతానని బీరాలు పలుకుతున్నాడు.. ఇంకో నాయకుడేమో ఖమ్మం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థులను ఎమ్మెల్యేలుగా అసెంబ్లీ గేటు తాకనివ్వబోను అని శపథం చేస్తున్నాడు. ఈ మాటలను చూస్తుంటే నవ్వొస్తుందన్నారు. నేను నిజాం కాలేజీలో చదువుకున్న రోజుల్లో పాలేరులో పరిస్థితులు మార్చాలని తనవంతుగా కందాళ ఫౌండేషన్ అనే సంస్థ పేరుతో ఎంతో కృషి చేశాను. కానీ.. అది ప్రజల అవసరాలకు తగ్గట్టుగా సరిపోలేదు. స్వరాష్ట్రం వచ్చిన తర్వాతే పాలేరు నియోజకవర్గం అభివృద్ధి బాట పట్టింది. వ్యవసాయంతోపాటు అన్నిరంగాల్లో దూసుకుపోతున్నది' అని వివరించారు.

### చెరువులు బలోపేతం..

'మిషన్ కాకతీయ' పథకంలో భాగంగా పాలేరు నియోజకవర్గవ్యాప్తంగా 120 చెరువులు, కుంటలకు పూర్వ వైభవం వచ్చింది. చెరువుల బలోపేతానికి ప్రభుత్వం రూ.26 కోట్ల నిధులు వెచ్చించింది. చెరువు కట్టలు బలోపేతం కావడంతో వానకాలంలో పంటలకు వరద ముప్పు తప్పింది. ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరిగాయి. బావుల్లో సమృద్ధిగా నీరు ఊరుతున్నది. సాగునీటికి ఢోకా లేకుండాపోయింది.



### ప్రభుత్వ బడులకు మహర్దశ..

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మొదటి విడుత 'మన ఊరు-మన బడి' పథకానికి నియోజకవర్గవ్యాప్తంగా 75 పాఠశాలలు ఎంపికయ్యాయి. సర్కార్ విడుదల చేసిన రూ.30 నిధులతో అధికారులు ఆయా పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఆయా పాఠశాలల్లో ఇప్పటికే 90శాతం పనులు పూర్తయ్యాయి. ఒక్కో పాఠశాల కార్పొరేట్ స్థాయిలో వసతులు సమకూర్చుకుంటున్నది. అలాగే నియోజకవర్గంలో రవాణావ్యవస్థను మెరుగుపరిచేందుకు సర్కార్ రూ.250 కోట్లతో తిరుమలాయపాలెం, కూసుమంచి, ఖమ్మం రూరల్, నేలకొండపల్లి మండలాల్లో రహదారులు నిర్మించింది. అలాగే పాలేరు మండల కేంద్రంలోని ఇన్‌టేక్ వెల్ ద్వారా ఖమ్మం జిల్లా 2,75,354 ఇండ్లకు మిషన్ భగీరథ నీరు అందుతున్నది.

### విద్యావికాసానికి బాటలు..

నియోజవర్గ పరిధిలోని కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ పరిధిలో కస్తూర్బా గాంధీ విద్యాలయాలు అందుబాటులోకి వచ్చాయి. తొలుత అద్దె భవనాల్లో నడిచినప్పటికీ ప్రస్తుతం మూడింటికీ సొంత భవనాలు సమకూరాయి. ఆయా విద్యాలయాల్లో ప్రస్తుతం 1,100 మంది బాలికలు 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్నారు.

### పల్లెల రాత మార్చిన 'పల్లె ప్రగతి'

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన 'పల్లె ప్రగతి' పథకంతో నియోజకవర్గ పరిధిలోని పల్లెలు అభివృద్ధి బాట పట్టాయి. రూ.16.92 కోట్లతో సర్కార్ నియోజకవర్గవ్యాప్తంగా 141 గ్రామాల్లో వైకుంఠధామాలు నిర్మించింది. 141 గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు, 141 నర్సరీలు అందుబాటులోకి వచ్చాయి. అలాగే ప్రజారోగ్య సంరక్షణ కోసం నియోజకవర్గ వ్యాప్తంగా 30 పల్లె దవాఖానలు అందుబాటులోకి వచ్చాయి.

### 3,16,922 మందికి రైతుబంధు

రైతుబంధు పథకం ద్వారా ప్రస్తుతం నియోజకవర్గవ్యాప్తంగా 3,16,922 మందికి రైతుబంధు అందుతున్నది. అలాగే వివిధ కారణాలతో నియోజకవర్గవ్యాప్తంగా 1,235 మంది రైతులు మృతిచెందారు. ఒక్కో మృతుడికి కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున రూ.61.75 కోట్ల బీమా అందజేసింది. కల్యాణలక్ష్మి ద్వారా ఇప్పటివరకు నియోజకవర్గవ్యాప్తంగా 2,325 మంది లబ్ధిదారులకు రూ.23.27 కోట్ల సొమ్ము అందింది. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఇప్పటివరకు సుమారు 7,500 వేల మంది బాధితులకు ఆర్థిక సాయం అందింది.

### 'దళితబంధు'తో ఎస్సీ కుటుంబాల్లో వెలుగులు..

దళితబంధు పథకంలో భాగంగా నియోజకవర్గవ్యాప్తంగా 100 ఎస్సీ కుటుంబాలకు 100 యూనిట్లు అందాయి. లబ్ధిదారుల్లో ఎక్కువ మంది వరి కోత మిషన్లు, ట్రాక్టర్లు, మినీ ట్రాన్స్‌పోర్ట్ వాహన యూనిట్లు తీసుకున్నారు. అలాగే రైతులకు సేవలు అందించేందుకు సర్కార్ నియోజకవర్గవ్యాప్తంగా సుమారు రూ.6 కోట్లతో 29 రైతువేదికలు నిర్మించింది.

### 'భక్తరామదాసు'తో కరువు నేల సస్యశ్యామలం



పాలేరు నియోజకవర్గంలోని ఎక్కువ భాగం నాడు కరువు ప్రాంతం. ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత వెనుకబడిన ప్రాంతంగా దీనికి పేరుండేది. సాగునీటి వసతి లేక రైతులు తమ భూముల్లో ఆముదం, జొన్నలు మాత్రమే సాగు చేసేవారు. అది కూడా ఏడాదిలో ఒక్క వానకాలం సీజన్‌లో మాత్రమే. ఇక వరి, మిర్చి, పత్తి వంటి పంటల ప్రశ్నే లేదు. అప్పుడు ఎకరా భూమి విలువ కేవలం రూ.2 లక్ష నుంచి రూ.3 లక్షల వరకు ఉండేది. తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ ఇక్కడి రైతుల కష్టాలు తెలుసుకున్నారు. వారి సమస్యలకు పరిష్కారం చూపాలనుకున్నారు. ఎత్తిపోతల ద్వారా పాలేరు జలాశయం నుంచి జలాలు మళ్లించాలనుకున్నారు. 16 ఫిబ్రవరి 2016న సీఎం కేసీఆర్ ఎత్తిపోతల పనులను ప్రారంభించారు. రూ.335.59 కోట్లతో జలాశయం నుంచి ఇరిగేషన్ అధికారులు తిరుమలాయపాలెం మండలంలోని ఇస్లావత్‌తండా వరకు 8 కిలోమీటర్ల మేర టన్నెల్ నిర్మించారు. 27 జనవరి 2017న సీఎం కేసీఆర్ ఎత్తిపోతలను ప్రారంభించారు. కేవలం 11 నెలల్లోనే పూర్తి చేసుకున్న ప్రాజెక్ట్‌గా భక్తరామదాసు పథకానికి పేరున్నది. ఇస్లావత్‌తండా నుంచి శ్రీరాంసాగర్ కాలువల ద్వారా తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, కూసుమంచి, పాలేరు, ముదిగొండ, ఖమ్మం రూరల్ మండలాల్లోని 79,500 వేల ఎకరాలకు సాగునీరు అందుతున్నది. ప్రస్తుతం ఇక్కడి రైతులు ఆకుకూరలు, కూరగాయలు, వరి, మిర్చి, పత్తితో పాటు అన్ని రకాల పంటలు పండిస్తున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఎకరా భూమి రూ.35 లక్షల వరకు పలుకుతున్నది. జాతీయ రహదారి పక్కన ఉన్న భూములు అంతకంటే ఎక్కువ ధరలే పలుకుతున్నాయి. భూముల ధరలు అమాంతం పెరిగింది. ఏటా రెండు పంటలు పండుతుండడంతో వేలాది మంది వ్యవసాయకూలీలకు కూలి దొరుకుతున్నది. అలాగే సర్కార్ రూ.64.50 కోట్లతో పాలేరు పాత కాలువను ఆధునీకరించింది.

### మత్స్య కళాశాల, నర్సింగ్ కాలేజీలు..
### జేఎన్టీయూ క్యాంపస్..

పాలేరులోని మత్స్య పరిశోధన కేంద్రం ఏళ్ల నుంచి మత్స్యకారుల జీవన ప్రమాణాల పెంపు కోసం మత్స్యపెంపకంలో పరిశోధనలు చేస్తున్నది. పరిశోధనలకు మరింత ప్రాధాన్యం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూసుమంచి మండలం జుఝుల్‌రావుపేట పరిధిలోని మల్లాయిగూడెం రహదారి పక్కన 10 ఎకరాల్లో మత్స్య కాలేజీ నిర్మించనున్నది. తద్వారా వందలాది మంది విద్యార్థులు ఫిషరీస్ కోర్సు చదువనున్నారు. రాష్ట్రంలోనే ఇది మొట్టమొదటి మత్స్యకళాశాల కావడం విశేషం. అలాగే ఖమ్మంలోని ప్రధానాసుపత్రికి అనుసంధానంగా నడుస్తున్న వైద్యకళాశాలకు అనుసంధానంగా ఖమ్మం రూరల్ మండలంలో నర్సింగ్ కళాశాల ఏర్పాటైంది. అలాగే ఇదే మండలంలో ప్రతిష్ఠాత్మక జేఎన్టీయూ క్యాంపస్ అందుబాటులోకి వచ్చింది. ఇంజినీరింగ్ విభాగంలో ఇప్పటికే అడ్మిషన్లు పూర్తయ్యాయి.

---

## తుమ్మల సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో
# ఖమ్మం నగరానికి చేసిన మేలు ఏమిటి?

- రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, అక్టోబర్ 30: కాంగ్రెస్ పార్టీ ఖమ్మం ఎమ్మెల్యే అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు సుదీర్ఘ కాలం పాటు రాజకీయాల్లో ఉన్నారని, అనేక పదవులు అలంకరించారని, ఇంత అనుభవంలో ఖమ్మం నగరానికి ఆయన చేసిన మేలు ఏమిటో ప్రజలకు వివరించాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సవాల్ విసిరారు. ఖమ్మం నగరంలోని ఓ ఆస్పత్రిలో సోమవారం ప్రముఖ వైద్యుడు డాక్టర్ గంగరాజు అధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తుమ్మలకు మొదటి నుంచి తానొక్కడే బాగుపడాలని, మరొకరు బాగుపడకూడదనే ఉద్దేశాలు ఉంటాయని విమర్శించారు. తాను చేసిన అభివృద్ధి కూడా తుమ్మలే చేసినట్లు నిస్సిగ్గుగా చెప్పుకొంటున్నారని మండిపడ్డారు. తన హయాంలోనే నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. నగరాభివృద్ధితోనే నగరానికి సూపర్ స్పెషాలిటీ, మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు వచ్చాయన్నారు. తద్వారా ఎంతోమంది యువత ఉపాధి అవకాశాలు పొందారన్నారు. నగర పరిధిలోని నూతన కలెక్టరేట్ భవనం, ఐటీ హబ్, ప్రభుత్వ మెడికల్ కాలేజ్, ధంసలాపురం ఆర్వోబీ, నూతన బస్టాండ్, లకారం ట్యాంక్ బండ్, మున్సిపల్ రోడ్స్, ప్రధానాసుపత్రికి అనుసంధానంగా తల్లీ పిల్లల హాస్పిటల్, గొల్లపాడు చానల్ ఆధునీకరణ.. ఇలా అనేక పనులను ప్రైవేటు కాంట్రాక్ట్ సంస్థలు టెండర్లు వేసుకుని దక్కించుకున్నాయన్నారు. టెండర్ల ద్వారానే పనులు జరుగుతాయని, కనీస జ్ఞానం ఉన్న ఎవరికైనా తెలుస్తుందన్నారు. కానీ తుమ్మలకు ఈ విషయం తెలియకపోవడం శోచనీయమన్నారు. తనపై బురద జల్లాలనే ఉద్దేశంతోనే తుమ్మల ఆ పనులకు తనకు సంబంధం ఉన్నట్లు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ప్రజలు వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసి తుమ్మల వంటి విలువలు లేని నాయకుడిని ఓటమి పాలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, డాక్టర్ భాగం కిషన్ రావు, డాక్టర్ చైతన్య, డాక్టర్ సీతారాం, డాక్టర్ నవీన్, డాక్టర్ అనూష, డాక్టర్ ఆలూరి వంశీ, పాల్గొన్నారు.

### మంత్రి అజయ్ కాన్వాయ్ తనిఖీ

- సహకరించిన మంత్రి పువ్వాడ



మంత్రి వాహనం తనిఖీ చేస్తున్న పాలెం పోలీసులు

రఘునాథపాలెం, అక్టోబర్ 30: మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సోమవారం మండల పర్యటన నిమిత్తం కాన్వాయ్‌లో వెళ్తున్నారు. ఈక్రమంలో కోయచలక క్రాస్ రోడ్డు వద్ద రఘునాథపాలెం పోలీసులు కాన్వాయ్‌ను ఆపారు. మంత్రి వారికి సహకరిస్తూ కారు దిగారు. పోలీసులు అనంతరం కాన్వాయ్‌ను తనిఖీ చేసి ఆల్ క్లియర్ అని తేల్చారు. అనంతరం మంత్రి యథావిధిగా తన పర్యటనను కొనసాగించారు. మంత్రి వెంట డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం ఉన్నారు.

---

# అభివృద్ధిని చూసి ఆదరించండి

- మండలంలో ఐదేళ్ల లో వందల కోట్లతో అభివృద్ధి
- రైతుబంధు వద్దన్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి : ప్రభుత్వ విప్ రేగా
- బీఆర్ఎస్‌లో చేరిన 20 కాంగ్రెస్ కుటుంబాలు



కార్యకర్తలతో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

పినపాక, అక్టోబర్ 30 : ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి ఆదరించాలని, వచ్చే ఎన్నికల్లో తనను మరోసారి గెలిపిస్తే ప్రజలకు మరింత సేవ చేస్తానని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. సోమవారం మండలంలోని మల్లారం, గోపాలరావుపేట గ్రామాల్లో పర్యటించిన ఆయన బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను కలుసుకొని ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై వివరించారు. మల్లారం గ్రామంలో 20 కాంగ్రెస్ కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరగా.. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధిని చూసి ఆదరించి ఓట్లు వేయాలని కోరారు. పినపాక మండలంలో ఐదేళ్లలో వందల కోట్ల నిధులు తీసుకొచ్చి అన్ని గ్రామాలను అభివృద్ధి చేశానన్నారు. రైతుబంధు నిలిపివేయాలని ఎన్నికల కమిషన్‌ను ఫిర్యాదు చేసిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. రానున్న 30 రోజులు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను, పార్టీ మ్యానిఫెస్టోలోని హామీలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న మల్లారం సర్పంచ్ కొమరం రాధాబాయి భర్త నారాయణను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుమ్మడి గాంధీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పగడాల సతీశ్‌రెడ్డి, ఆత్మ చైర్మన్ భద్రయ్య, నాయకులు బొలిశెట్టి నర్సింహారావు, కామేశ్వరరావు, బూర సురేశ్, సోంపెల్లి తిరుపతి, కార్యకర్తలు పాల్గొన్నారు.